# వాత్సల్యం

మండుతున్న జ్యోతి మీద మూకుడు బోర్లించినట్లు ఆకాశంలో వెలుగు ఆరిపోతున్నది. చౌరాస్తాలోని మ్యునిసిపాలిటి గడియారం నగరం గుండెల మీద ఆరు కొట్టింది. చౌరాస్తాలోని మానవ ప్రవాహాన్ని చూస్తూ ఏవేవో ఆలోచనలలో నిమగ్నుడై ఉన్న రాజు ఉలిక్కిపడ్డాడు.

ఆరయి పోయింది. బస్సు ఇంకా రాలేదు. అసలే చికాకుగా ఉన్న రాజు పక్కనే కీచు గొంతు ఏడు పొకటి వినబడింది. ఆ పిల్లకు నాలు గేళ్ళుంటాయో లేక రెండేళ్ళే ఉంటాయో చెప్పడం కష్టమే. పెద్ద పొట్టా, పుల్లల్లాంటికాళ్ళు చేతులూ, నల్లటి రంగూ! పసి పాపలకు సహజమైన పాల బుగ్గలూ లేవు. పసిడి నవ్వులూ లేవు. తల్లి కాబోలు - నిండు చూలాలు - విసుగు కొద్దీ చాచి రెండు కొట్టింది పిల్లను. పిల్ల గొంతు తారస్థాయి నందుకుంది. ఎముకల్లో మూలుగు సన్నగిల్లి, రక్తంలో జీవం చచ్చి కళ్ళలో కాంతి కరిగి పోయినా, ఆమె ఇంకా మరో జీవికి ప్రాణంపోయడానికి సిద్ధంగా ఉంది. కాలం గీచిన ఆమె నొసటి మీది గీతలూ, మేఘావృతమైన ఆ కళ్ళూ, ఎముకల గూళ్ళలా ఉన్న కాళ్ళూ చేతులూ,

తనుతమ గాథలను వినిపించడానికి సిద్ధంగా ఉన్నట్లనిపించింది రాజుకు, ఆమెను చూస్తూ ఉంటే.

బస్సుకోసం వేచి ఉండడమే ఒక చికాకు! పైగా పిల్లరొద! ఓదార్చడంపోయి ఇంకా బాదుతోంది ఆ తల్లి.

"ఇదుగో! ఏమమ్మోయ్! బిడ్డను అలాకొట్టి ఏడిపించకపోతే పాలిచ్చి సముదాయించకూడదూ?" రాజు మాట గొంతులోనే ఉంగిడి చుట్టుకుపోయింది, ఆ చూలాలి ముఖం చూస్తూ ఉంటే.

"పాలా!" అంటూ ఆమె తన పొట్టకేసి చూచుకుంది. ఆ చూపులోని సిగ్గో, అసహ్యమో, జాలో, మాతృత్వమో అర్థం చేసుకొనడానికి ప్రయత్నించలేదు రాజు.

"పాలా? పాలైతే ఆ కొట్లో ఉన్నాయి. పైసలేలేవు నా దగ్గర" దూరంగా వీధిమలుపులో ఉన్న దుకాణంకేసి చూస్తూ అంది ఆమె.

రాజు పావలాతీసి విసురుగా ఆమె చేతుల్లో విదిలించాడు. డబుల్ డెకర్‌లా భారంగా, మెల్లగా కదిలింది ఆమె సంచిలో ఉన్న గిన్నె తీసుకొని.

"ఈ పిల్లనుకూడా మోసుకెళ్ళలేను. పాలు తెచ్చేవరకూ బిడ్డను కొంచెం చూస్తారా?" దీనంగా అడిగింది రాజును.

"అవును పాపం నిన్నే నువ్వే మోసుకోలేకుండా ఉన్నావు" అనుకుంటూ రాజు అంగీకార సూచకంగా తల ఊపాడు. "పోషించలేని దానికి పిల్లలెందుకో!" నిందుగా బరువుగా తిరిగి తిరిగి చూస్తూపోతున్న చూలాలికేసి చూస్తూ

ఆలోచనా స్రవంతిలో పడికొట్టుకుపోతున్న రాజుకు పేవ్‌మెంట్‌మీద దొర్లుతున్న పసిపిల్ల ఏడుపు వినిపించింది. రోడ్డుమీదికి ప్రాకుతున్న పిల్లను ఎత్తుకొనివచ్చి పేవ్‌మెంట్‌మీద మళ్ళీ కూర్చోబెట్టి ఏడుపుమాన్పించే ప్రయత్నంలో పడ్డాడు రాజు.

గంట స్తంభం ఏడుకొట్టింది. అది ఇంకా రాలేదేం! బస్సుకాదు. బస్సు రావడమూ, పోవడమూ కూడా జరిగింది. అది— ఆ పిల్లతల్లి. రాజుకు ముచ్చెమటలూ పట్టాయి. ఆ ఆడది తనను మోసంచెయ్యలేదు కదా.

ఏమిటీ దారుణం! మాతృత్వం సాకారమయిందా అన్నట్లున్న ఆ స్త్రీయే ఇంత దారుణానికి ఒడికట్టిందా! కన్నబిడ్డనే ఇలా వదిలేస్తుందా! ఏం ఎందుకు కాకూడదూ? మోయలేని బరువును దించివేయడం తప్పా? పాపం! వదిలేయక ఏం చేస్తుంది? బాగానే ఉంది తన ఆలోచన. అయితే ఆ బరువును కావాలని ఎవరు నెత్తికెత్తుకుంటారు? తను ఏ పరిస్థితిని తలుచుకొని జాలిపడుతున్నాడో ఆమె తననుమోసం చేసింది. ఇక ఎక్కువసేపు ఇక్కడ ఉండడం క్షేమ కాదు. రెండడుగులు ముందుకు వేశాడు.

"మామయ్యా!" బొంగురుగొంతు ఏడుపు. కాళ్ళు ఆగిపోయాయి. ఏం చెయ్యడం? పసిబిడ్డను వదిలేసి ఎలా వెళ్ళడం? తను అలా వదిలేసి వెళ్ళిపోతే ఏమయిపోతుంది ఈ బిడ్డ! ఇంటికి తీసుకువెడితే... ఈ పిల్ల పెద్దబరువు కాదు తనకు. కాని ఏ కులమో! కన్నబిడ్డనే వదిలేసి వెళ్ళిపోయిన ఆ స్త్రీ లాంటిదో! తన పిల్లల్లో ఈ పిల్ల కలుస్తుందా? తన

సంస్కారం, అభిరుచులూ, అలవాట్లూ ఈ పిల్లకు అబ్బుతాయా! తనభార్య ఇందుకు అంగీకరిస్తుందా? అసంభవం! ఎలాగ్గయినా వదిలించుకోవాలి. ఆ అమాయిక ప్రాణి తన వైపే చూస్తున్నది. తన జేబులోని బిస్కత్తు పొట్లంతీసి విప్పి రెండు పిల్ల చేతిలో పెట్టాడు. ఏడుపుమాని బిస్కత్తులు తింటూ కూర్చుంది బిడ్డ.

"ఇదిగో భాయ్! సిగరెట్టు పాకెట్ అయిపోయింది. తెచ్చుకుంటా. అందాకా ఈ పాపను కొంచెం చూస్తుంటావా" అంటూ రాజు దూరంగా ఉన్న సైకిల్ షాప్ కేసి చూచాడు. గఫూర్ తల ఎత్తకుండానే సిగరెట్ ముట్టించుకుంటూ 'ఊఁ' అన్నాడు పిల్లవైపు చూడకుండానే. వింటి నుంచి విడిచిన బాణంలా రాజు వెళ్ళిపోయాడు.

గంట స్తంభం ఎనిమిది కొట్టింది. గఫూర్ పిల్ల వైపు చూచాడు. గతుక్కుమన్నాడు. అరే ఈ బిడ్డ ఆ యువకుని కూతురా! నమ్మడానికి వీలులేదు. ఇందులో ఏదో మోసం ఉంది. మోసాలు చెయ్యడంలో పేరుమోసిన తనకే మోసం జరిగింది. అది విచిత్రమైన మోసం! బిస్కత్తులు తింటూ కూర్చున్న పిల్లవైపు చూచాడు. చిన్న మెత్తు బంగారంకూడా లేదు పిల్ల ఒంటిమీద. ఎత్తుకు వెళ్ళి అమ్ముకుందామన్నా ఈ ఎముకలగూటిని ఎవరు కొంటారు?

ఛూత్ తన కెందుకీ గొడవ! ముందుకుసాగాడు. ఎవరో గళ్ళలుంగీ పట్టి లాగినట్లయింది. పాపం! ఏడుపు ముఖంతో ఒకసారి చూచి భయంతో కళ్ళుమూసుకొని కాలుకు చుట్టుకుపోయింది పసిది. ఏమిటిది తన జీవితంలో ఎన్నడూ

కలగని జాలి ఈ బిడ్డమీద కలుగుతోంది. తీసుకెళ్ళి పెంచుకుంటే? ఏమిటీ మమకారం! కాఫిర్ బిడ్డను సాకడమా! కాని పసిబిడను ఎలా వదిలివెళ్ళడం! బిడ్డ దేనికిందైనా పడి చచ్చిపోతే!

అదుగో ఆ వచ్చే శాస్త్రిలవారికి తగిలిస్తే సరిపోతుంది. "ఏమండో శాస్త్రిలూ!" ఉలిక్కిపడ్డాడు శాస్త్రిలు. "దూరం దూరం" అన్నాడు శాస్త్రిలు దగ్గరగా వస్తున్న గఫూర్‌తో. "ఎందుకు శాస్త్రిలూ అంత భయం. ముట్టుకోనులే. కాస్తంత ఈ పిల్లను చూస్తుండు. నేను ఆ పక్క కెళ్ళి కాలుమడుచుకొస్తా ఇప్పుడే: చూడమ్మా తాత" అంటూ శాస్త్రిని ఆ బిడ్డకు చూపించి శాస్త్రిగారి జవాబుకు ఎదురు చూడకుండానే ముందుకు దూసుకుపోయాడు గఫూర్.

తాతలంటే ఉండే సరదా, పిల్లలకు మరెవ్వరన్నా ఉండదు. తాత మోకాళ్ళపైని ఉన్న ధోవతినిపట్టి లాగుతూ "తాత తాత" అంటూ నవ్వింది పాప. "రామరామ! మైల పడిపోయాను. పైగా ఈ తురకపిల్లకు తాతనట తాతను!" శాస్త్రిలవారు లబలబ లాడిపోతున్నారు.

ఈ పిల్లతండ్రి ఇంకా రాలేదేం చెప్మా! తనకేనో మోసం జరిగింది. అటూ ఇటూ చూచాడు శాస్త్రిలు. బస్ స్టాండ్‌నిండా జనమే. ఎలాగబ్బా ఈ పీడను వదిలించుకోవడం! నవగ్రహశాంతి చేయించి తిరిగివస్తున్న శాస్త్రిలవారు పెద్ద అశాంతిలో పడ్డారు.

రాజు ఇంట్లో కాలు పెడుతూనే దేనికోసమో మారాం చేస్తున్న చిన్ని ఏడుపు వినిపించింది. స్మృతిపథంలో బొంగురు గొంతు ఏడుపూ, 'మామయ్యా' అనే పిలుపూ, గిర్రున వెనక్కు తిరిగాడు. ఆ బిడ్డను ఆ రౌడీ ఏం చేశాడో! దేనికిందనైనా పడిపోయిందేమో! వెక్కివెక్కి గొంతు ఎండిపోయి చచ్చిపోయిందేమో! తను ఎంత నీచంగా ప్రవర్తించాడు! శిశుహంతకులకు శిక్షఏమిటి? రాజు చౌరాస్తా వైపుకు పరుగు తీశాడు. ఎదురు రోడ్డునుంచి రౌడీ గఫూర్ కూడా ఆదుర్దాగా చౌరాస్తాకేసి రావడం చూచాడు. వీడు తను అనుకున్నంత పనీ చేసివుంటాడు.

బస్‌స్టాండులో జనం మూగి ఉన్నారు. ఇటునుంచి గఫూర్. అటునుంచి రాజూ 'పాపా' అంటూ జనాన్ని తోసుకుంటూ పరుగెత్తారు. పాప తాతకాళ్ళకు చుట్టుకొని 'తాతా! తాతా?' అంటూ ఏడుస్తోంది. బిడ్డను స్వీకరించే విశాల హృదయమూ లేక, రోడ్డుమీద పారవేసి పోయేంతటి కఠిన హృదయమూ లేక తాత తబ్బిబ్బు అవుతున్నాడు. "నేను ఈ బిడ్డకు తాతను కాదు బాబోయ్" అంటూ చుట్టూ మూగిన జనాన్ని నమ్మించడానికి తాతకు తాతలు దిగివస్తున్నారు. రాజును చూచి పాప 'మామయ్యా' అంటూ దగ్గరికి వచ్చింది. పక్కన గఫూర్‌ను చూసి తొర్రపళ్ళ సందునుంచి పువ్వులు వెదజల్లింది. రాజూ, గఫూర్ ఇద్దరూ పాప తనకు కావాలని పోటీపడడం జనం ఏమీ అర్థంకాక విస్తుపోయి చూస్తున్నారు.

లేగ దూడకోసం 'అంబా' అని అరుస్తూ వచ్చే ఆవులా 'చిట్టీ' అని అరుస్తూ జనంలోకి చీల్చుకొని వచ్చింది ఒక నిండు చూలాలు. వాత్సల్యం కట్టలు తెంచుకుంది. తల్లీ బిడ్డా పెనవేసుకు పోయారు. బిడ్డ తలమీద రెండు వేడి కన్నీటి చుక్కలు పడ్డాయి.

ఆ స్త్రీ రాజువైపు చూడడానికి సిగ్గుపడుతోంది. ఆమె వద్దని వారిస్తున్నా వినిపించుకోకుండ జేబులోనుంచి పది రూపాయలు తీసి పాపచేతిలో పెట్టాడు రాజు, బనియన్ జేబులోనుంచి గఫూర్ ఒకరూపాయి, కొన్ని చిల్లరడబ్బులూ తీసి పిల్ల చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు. శాంతి చేయిస్తే వచ్చిన సంభావన డబ్బులు బిడ్డచేతిలో పెట్టి దీవించి కళ్ళ నీళ్ళతో కదలిపోయాడు శాస్త్రులు.